# విముక్తి

ఆడపిల్ల అందమైన శరీరాలను కోసి, రక్తంలో ఎర్రగా మడిచిన వాళ్ళ గుండెకాయల్ని ఎర్రదీపాలుగా వ్రేలాడ కట్టారా అన్నట్లు ప్రతి యింటి గుమ్మానికీ ఎర్రదీపాలు వెలుగుతున్నాయి.

అది బొంబాయినగరంలోని ఒక రెడ్‌లైట్ ఏరియాలోని ఒకానొక వేశ్యావాటిక. సందెకాడ వుండే మామూలు సందడి తగ్గి, బేరాలు కుదిరి లోపలిగదుల్లో వ్యాపారం సాగుతున్న సమయం.

ఆ సమయంలో ఒకానొక యింటిలోని, ఒక మారుమూల చీకటి గదిలోంచి సన్నగా ఏడ్పు వినిపిస్తోంది...

చక్రాలుగా తరిగిన వుల్లిపాయి ముక్కలూ, నిమ్మకాయ బద్దలూ వున్న ప్లేటు తీసుకొని వంటింట్లోంచి వస్తోన్న చుక్క ఆ గది ముందు ఒక క్షణం ఆగింది.

మళ్ళీమళ్ళీ ఏడుస్తున్నట్లు, కుమిలికుమిలి ఏడుస్తున్నట్లు ఆ ఏడ్పు ఆగిఆగి వినిపిస్తోంది.

చుక్క మెల్లగా ఆ గది గుమ్మం దగ్గరికి వెళ్ళింది. దగ్గరకు వేసివున్న తలుపుల్ని చేత్తో శబ్దంచెయ్యకుండా మెల్లగాతోసి, లోపలికి తొంగి చూసింది.

ఆ గదిలోని మసక వెల్తురులో ఒక పిల్ల గువ్వలాగా మునగదీసుకొని నేలమీద కూర్చొని సన్నగా ఎక్కిళ్ళుపెడుతూ ఏడుస్తోంది.

ఆ పిల్లను అలా చూడగానే చుక్కకు ఎంతో జాలేసింది. ఈ పిల్లను ఆ సాయంకాలమే తీసికొచ్చి ఎవరో మూడువేల రూపాయిలకు ఈ కంపెనీకి అమ్మేసిపోయారు. తనకులాగే తెలుగుపిల్లంట. ఈ చిన్నారి బ్రతుకు ఈ నరకకూపంలో, ఈ కుళ్ళులో బ్రద్దలవుతుంది. చుక్క దీర్ఘంగా నిట్టూర్చింది. ఇంతలో, 'చుక్కా, చుక్కా', అన్న పిలుపుకి చుక్క గబగబా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

మెత్తటి స్పాంజ్ దిండ్లు వేసిన సోఫాలో, ఒక ప్రౌఢ స్త్రీ సుఖాసీనురాలై వుంది. ఆమె టీపాయ్ మీద వున్న ప్లేట్లలోంచి చికెన్‌ఫ్రై ముక్కల్నీ, రొయ్యి వేపుడ్నీ, మునివ్రేళ్ళతో సుతారంగా తీసికొని తింటూ, గ్లాసులోని విదేశీ విస్కీని విలాసంగా సేవిస్తోంది.

చుక్క వుల్లిపాయ ముక్కల ప్లేటును టీపాయ్ మీద పెట్టింది.

"ఏవే గుడిశేటి లంజా, నిన్నెన్నిసార్లు పిలవాలే!" అంది జయలక్ష్మి కోపంగా.

"ముక్కలు తరుక్కురావద్దక్కా?" అంటూ వంగొని ఖాళీ అయిన గ్లాసులోకి సీసాలోని విస్కీ పోస్తోంది.

ఆ గదిలో ఒక మూలవున్న ఫ్రిజ్‌లోంచి ఐస్‌ముక్కల్ని తీసికొస్తున్న ఒక యువకుడు వంగున్న చుక్క పృష్టంమీద కాలెత్తి తన్ని "ఇవన్నీ ముందే చూసుకోవాలే బద్మాష్ ముండా!" అన్నాడు హిందీలో.

చుక్క ఆ తన్నుకు టీపాయ్ మీద పడబోయి ఎలాగో ఆపుకొని వెనక్కి తిరిగి చూచింది.

ముకుంద్- వోనరమ్మ మిండడు. పాతికేళ్ల పడుచు కుర్రాడయిన ముకుంద్‌ను, ముప్ఫై ఆరేళ్ళ ప్రౌఢవయస్సు జయలక్ష్మి ముచ్చటగా వుంచుకొని, ముద్దుగా చూచుకుంటోంది. ముకుంద్ ముచ్చటగా టక్ చేసుకున్న వైట్ టీషర్టులో, వైట్ జీన్స్‌లో, కండలు తిరిగిన శరీరంలో చిన్న సైజు పహిల్వాన్‌లాగా, హిందీ సినిమాల్లో స్టంట్ చేసే వాడులాగా వుంటాడు.


ముకుంద్ ఆ ముండల రాజ్యానికి మకుటం లేని రాజు. కంపెనీ వ్యవహారాలన్నీ వాడిమీదే నడుస్తుంటాయి. వాడికామె డబ్బు సుఖాలను అందిస్తుంటె, వాడామెకు రతిసుఖాలు అందిస్తుంటాడు.


ముకుంద్‌ను చూడగానే చుక్క కళ్ళల్లో అసహ్యంతో కూడిన బెదురు ప్రతిఫలించింది. ఎందుకంటె వాడు పేరుకు మాత్రమే ముకుందుడు. మనిషి మాత్రం రాక్షసుడు. 'ఆ కంపెనీ సాని పాపల పాలిటి యమధర్మరాజు.

ఆమె కళ్ళల్లో కనిపించిన 'అసహ్యాన్ని' పసిగట్టి, "ఎందుకే బద్మాష్‌ముండా, అలా చూస్తావు?" అంటూ చుక్క మీదకు వచ్చాడు.

నోట్లో వెలుగుతున్న సిగరెట్టు తీసి గబుక్కున ఆమె మెడమీద చురక పెట్టాడు. చుక్క కెవ్వున అరిచింది . అతడు కసిగా నవ్వాడు.

"రా అల్లుడూ, ఆ ముండతో నీకేంటి? రంజుగా మందుకొట్టి, లబ్జుగా నాతోలవ్వాడు!"





# అరిగే కాలూకాళ్ళు

క్రైపెక్కిన కళ్ళతో తన ప్రియుడ్ని ఆహ్వానించింది.

ముక్క ఒకప్పుడు చక్కని ముక్కే! ఇప్పుడు మాత్రం అందవిహీనతతో దిష్టిబొమ్మలాగా వుంటుంది. ఒకప్పుడు, అంటె ఎనిమిదేళ్ళ క్రితం మొదటిసారిగా ఈ కంపెనీకి వచ్చినప్పుడు ఆరోగ్యకరమైన శరీరంతో అందంగా వుండి అందర్నీ ఆకర్షిస్తుండేది- జయలక్ష్మికి

దండిగా డబ్బులు సంపాదించిపెట్టుతుండేది. ఇప్పుడు మాత్రం జీర్ణించుకు పోయిన సుఖ రోగాల్తో హరించుకు పోయిన అందంతో, ప్రతి వాళ్ళతో ఈసడింపబడుతూ- ఈ కంపెనీకే దండుగ్గా వుంది.

విటుల్తో సరసానికీ, సంపాదనకూ పనికిరాని ఈ చుక్కను జయలక్ష్మి తన సొంత పరి చారికగా వాడుకుంటోంది.

చుక్క టీ గ్లాసు తీసుకొని మళ్ళీ ఆ చీకటి గదిలోకి వెళ్ళింది. ఇంకా పిల్ల ఏడుస్తూనే వుంది.

మెల్లగా ఆమె ప్రక్కన కూర్చుని, స్నేహంగా భుజంమీద చెయ్యివేసి, "మద్దేనం నుంచి ఏడ్చినదానివి ఏడ్చినట్లే వున్నావు, కాస్త వేడిగా ఈ టీ త్రాగు పిల్లా!" అంది ఆప్యా యంగా.

"నాకేం వద్దు!" కోపంగా, దురుసుగా అంది.

"ఏం తినకుండా, త్రాగకుండా ఏం చేస్తావు?" చుక్క జాలిగా అంది.

"చస్తా! ఈ బతుక్కంటే ఆ చావే నయం!"

"ఈ మాట ఆమె గుండెల్లో ఎక్కడో తగిలింది.

ఎండిపోయిన నవ్వొకటి నవ్వి, "పిచ్చిపిల్లా, నీకు తెలియదా, నీవు చచ్చినా నీ శవంతో వీళ్ళు వ్యాపారం చేయిస్తారు! వీళ్ళకి కావల్సిందల్లా డబ్బు! ఆ డబ్బుకోసం వీళ్ళు కన్నతల్లుల్తో, కట్టుకున్న పెళ్ళాల్తో, తోడబుట్టిన చెల్లెళ్లతో, ఆఖరికి చచ్చిన శవాల్తో కూడా వ్యాపారం చేయించే దుర్మార్గులు వీళ్ళు!" ఆవేశంగా అంది.


ఆమె గొంతులో వినిపించిన 'సిన్సియార్టీకి' ఆ పిల్ల తలఎత్తి ఆశ్చర్యంగా చూచింది. మాట ల్లోనే కాదు ఆమె మొగంలో కూడ ఆ సిన్సి యార్టీ కనిపించేసరికి ఆ పిల్ల కదిలిపోయింది. ఆపుకోలేని దుఃఖంతో గబుక్కున చుక్క భుజంమీద వాలిపోయి భోరున ఏడ్చేసింది...

అలా ఏడుస్తోన్న ఆ పిల్లను గాఢంగా తన గుండెల కదుముకుంది.

ప్రేమగా అనునయిస్తూ ఆమె చేత వేడి టీ త్రాగించింది. మెల్లగా ఆమె వివరాలు అడిగి తెలుసుకుంది. కర్పూరపు బొమ్మలాగా వున్న ఈ అమాయకురాలి పేరు కమల. వూరు విజయవాడ ప్రక్కన వున్న మంగళగిరి. చితికి పోయిన మధ్యతరగతి సంసారాల్లో ఆడపిల్ల పుటకే ఒక శాపమైతే, ఆ యింటిలోని నాలుగు

## శ్రీ శ్రీ

ఏ ఋతువులోనైనా నీ కలం
పూలగుత్తులు పూస్తుంది
కనురెప్పలు మూసుకోనున్నా



అదృశ్య వస్తువులు కనుపిస్తాయి నీకు-
నీ గుండె బరువు మోసిన క్షణాలనే
నీ కాలంగా గుర్తిస్తావు
గ్రీష్మరుతు జ్వాలా సేనల్ని
నీ చిన్ని రెక్కలతో ఓడించగల
గులాబీవి-
అన్ని గాయాలకూ ఔషధానివి
రోదసికే రోదసివి
సూర్యుడికే సూర్యుడివి-
ఆద్యంతాలు లేని మానవ దండ
కారణ్యంలో
మెరిసే రాజమార్గాలు నీ వాక్యాలు-
అనుభూతుల దేశాలకు
ఏకైక నాయకుడివి-
ఎన్ని మలుపులు తిరిగినా
వేగం తగ్గని నదీ ప్రవాహానివి-
ఎన్ని మలుపులు తిరిగినా వేగం తగ్గని
కాల ప్రవాహంలో నిరంతరం
కవిత్వం పడవలో తేలిపోయే
అజరామర నావికుడివి-

—సాత్యకి

శాపాల్లో మరో శాపం ఈ కమల. శాపం యిచ్చిన ఆ దేవుడే దయతల్చి ఈ శాపానికి అందమనే వరం కూడా యిచ్చాడు. ఆ అందం మీద కన్నేసిన ఒక దగుల్బాజీ ప్రేమనే వల విసిరి, పెళ్ళనే ఎరచూపి, మాయమాటలు చెప్పి, ఆశలు పెట్టి, బాసలు చేసి, నమ్మించి తనతోపాటు ఈ బొంబాయి నగరానికి లేపుకు వచ్చాడు.




బొంబాయిలో నాల్గురోజులపాటు అటూ ఇటూ త్రిప్పి, అవీ ఇవీ చూపించి, ఆ నాలుగు రోజుల్లోనే చిన్నారి యౌవ్వన ఫలాన్ని కక్కుర్తిగా నాలుగు కొరుకులు కొరికి, ఈ వేశ్యాగృహాని కమ్మేసి చల్లగా జారుకున్నాడు.

ఆమె కథ విని చుక్క దీర్ఘంగా నిట్టూర్చింది.

-2-

చుక్క, రతికేళిలో అలిసిపోయిన జయ లక్ష్మి కాళ్ళుపట్టి ఆమెను నిద్రపుచ్చి సామానంతా సర్ది ఆ గదిలోంచి బయటపడేసరికి రాత్రి పన్నెండుగంటలు దాటింది.

ఎంగిలిప్లేట్లూ, మిగిలిపోయిన విస్కీపీసాలు తీసుకొని ఆ యింటికి వెనుక తలుపుకున్న పాతసామానుల గదిలోకి వెళ్ళి ఒక మూల చతికిలపడింది.

ఎంగిలి ముక్కలను నంజుకుంటూ, మిగిలి పోయిన విస్కీ త్రాగుతూ చీకట్లోకి నిర్వేదంగా చూస్తూ ఏదో ఆలోచిస్తోంది... మొదటిసారిగా తాను ఈ బొంబాయికి వచ్చినప్పుడు, ఈ కమలలాగే అందంగా, అమాయకంగా వుండేది. ఈ పిల్లకులాగే తనకు కూడ అప్పట్లో ఇంత

పెద్దజడ వుండేది. కోలకళ్ళు, లేతవళ్ళు, పాలు కారే బుగ్గలూ. దీనైన నీటుగాడ్ని పెళ్ళాడి, పండుల్లాంటి బిడ్డల్ని కని బ్రతుకు పండించుకోవాలనే కన్నె కలలుకంటూ వుండేది. కాని, యింట్లో కటిక దరిద్రం. సుల్తానాబేగం అనే ఒక ముస్లిం స్త్రీ తనకు బొంబాయిలో వుద్యోగం యిప్పిస్తానని మాయమాటలు చెప్పి, ఎక్కడో తెలంగాణాలో కామారెడ్డి దగ్గరవున్న ఒక చిన్న పల్లెటూరులో వుండే తనని ఈ మహానగరానికి తీసికొచ్చి మోసగించి ఈ వేశ్యాగృహాని కమ్మేసింది. అప్పట్నుంచీ తనీ నరకకూపంలోనే వుంటూంది. మొదట్లో ఒకసారి ఇక్కడ్నుంచి పారిపోవటానికి ప్రయత్నించింది. తాను వి. టీ. స్టేషనుకు చేరే లోపలే ఈ కంపెనీ గూండాలు వేటకుక్కల్లాగా వెంటపడి వేటాడి తనని పట్టుకున్నారు. మళ్ళీ ఈ నరకకూపంలో పడేశారు. నానా చిత్ర హింసలూ పెట్టారు. ఆ దారుణ హింసలు అనుభవించాక మళ్ళీ అలాటి సాహస మెప్పుడూ చేయలేదు. కాని, తన ఉనికి తెలుపుతూ చాటుగా వాళ్ల వూరికి ఒకటి రెండు వుత్తరాలు రాసింది. అవి వాళ్ళ వూరికి చేరాయో లేదో తెలియదు. చేరినా, తనవాళ్ళు తనని చచ్చినదానితో జమకట్టి వూరుకున్నరేమో కూడా తెలియదు. ఏతావాతా, తన బ్రతుకు ఈ నరకకూపానికే అంకితమైపోయింది. తన శరీరం, మనస్సూ, రక్తం, యౌవ్వనం, ఆరోగ్యం... అన్నీ వీళ్ళకే ధారపోసి చివరికి ఈ హీనస్థితికి దిగజారిపోయింది...

ఒక దీర్ఘమైన వూరుకు ఎండిపోయిన ఆమె గుండెలోతుల్లోంచి పైకి ఎగదన్నుకుంటూ వచ్చింది...

ముక్కకు మళ్ళీ కమల గుర్తుకు వచ్చింది. ఆ పిల్ల అమాయక మొగం, బెదురుచూపులూ, తన మీద వాలిపోయి గుండెలవిసేటట్లు ఏడ్వటం, ఆ పిల్ల మృదువైన శరీరస్పర్శలో తను పులకించి పోవటం గుర్తుకు వచ్చాయి. 'ఇక నా బ్రతుకింతేనా? ఈ యింట్లోంచి బయట పడలేనా? మళ్ళీ మా వూరికి పోలేనా? మా వాళ్ళను చూళ్ళేనా?' అని ఆమె అమాయకంగా జాలిగొల్పే విధంగా అడగడం గుర్తుకు వచ్చి తన కడుపులో చెయ్యేసి కలచివేసినట్లనిపించింది.

మెల్లగా మళ్ళీ ఆ కమల వున్న గది దగ్గరకెళ్ళి లోపలికి తొంగి చూచింది.

పిచ్చిపిల్ల, ఏడ్చీ ఏడ్చీ సొమ్మసిల్లిపోయి నటుఎది- క్రిందే మునగదీసుకొని, పడుకుంది.




ఆమెను అలా చూస్తోంటే తనలో జాలి పెల్లుబికింది.

మళ్ళీ తన పాతసామానుల గదిలోకి వచ్చి తన దుప్పటి తీసికెళ్ళింది.

దుప్పటి కప్పుతుంటె కమల, "చూడమ్మా! నీలక్కయ్య నన్ను మంచంమీదనుంచి తోసేస్తోంది..." అంటూ నిద్రలోనే కలవరిస్తోంది.

పిచ్చిపిల్ల, ఇంకా తను వాళ్ళ వూళ్ళోనే వున్నాననుకుంటోంది, వాళ్ళక్కయ్య ప్రక్కలోనే పడుకున్నాననుకుంటోంది. ఇప్పుడు తాను వున్నదొక నరకకూపమనీ, క్రూరమృగాల గుహనీ మర్చిపోయింది.

ముక్క మళ్ళీ తన చీకటిగదిలోకి వచ్చింది. సీసాలో మిగిలివున్న విస్కీనంతా గబగబా గొంతులో పోసుకుంది. ఎప్పుడో తాను దాచి పెట్టిన గూట్లో గంజాయిని వెతికి బయటికి తీసింది. మెల్లగా గంజాయి త్రాగుతూ ఆ గదిలోని చీకట్లోకి చూస్తూ కూర్చుంటె, ఎందుకో ఆమెకి వూరికే ఏడ్పు ముంచుకొస్తోంది. భోరున ఏడవాలనిపిస్తోంది. ఈ అమాయకప్పిల్ల కమలను చూశాక మళ్ళీ ఇన్నాళ్ళకు తన వాళ్ళంతా గుర్తుకు వస్తున్నారు. తమ పల్లె, ఆ పల్లెలో తమ గుడిశ గుర్తుకు వచ్చాయి. తన తల్లీ, చెల్లీ, తమ్ముడూ గుర్తుకు వచ్చారు. కన్నెపిల్లగా కడవ చంకనపెట్టుకొని తాను నీళ్ళు తీసికొచ్చిన తమ వూరి చెర్వూ, ఆ చెర్వులోని కలువపూలూ గుర్తుకు వస్తోన్నాయి. తను బంతిపూలు పెట్టి పూజ్జేసిన అంకాలమ్మ గుడీ, దసరాపండుగనాడు తన స్నేహితురాళ్ళలో తాను బతకమ్మ ఆడటం గుర్తుకు వస్తోంది. మళ్ళీ తన జన్మలో తాను ఆ వూరుకెళ్ళగలదా, తన

వాళ్ళందర్నీ చూడగలదా, తమ వూరి చె
లోని కలువపూలను కోయగలదా, ఆ చె
నీళ్ళు కడవలో తేగలదా, ...లేదు లేదు
ఆళ్ళేదు... తన వాళ్ళందర్నీ చూళ్ళేదు...

ముక్కకు పొంగి పొంగి, పొర్లి పొర్లి ఏ
ముంచుకొస్తోంది... మెల్లగా లేచి నిలబడి
మెల్లగా చేతులు కట్టుకుంటూ, ఎప్పుడో త
పాడిన 'ఉయ్యాలో, ఉయ్యాలో...'
బతకమ్మ పాటను తనలో తాను గ
క్కుంటూ ఆ చీకటిగదిలో విస్కీసీసా చు
తిరిగింది.

అలా ఒక చుట్టు తిరిగేసరికి దు:
ముంచుకొచ్చింది. క్రింద కూలబడి, "ఎ
కమ్మా బతకమ్మ తల్లీ! నా బతుకిట్టా చేశా
అంటూ దు:ఖం ఆపుకోలేక, ఆవే
అణుచుకోలేక తన జుట్టుని పీక్కుంటూ, కు
కుళ్ళి- కుమిలికుమిలి ఏడ్చింది... ఏడ్చిం
ఏడ్చింది... అలా ఏడుస్తూనే లేచినిలబడి
కళ్ళు తుడుచుకుంది. విస్కీ విషంలో, గంజ
మత్తులో అణచుకోలేని ఆవేశంలో త
చేస్తుంది కూడ మర్చిపోయింది.

తూలుతూ బయటికి వచ్చింది.

అప్పుడు టైం రాత్రి రెండయిందో, మ
ఋందో యిల్లంతా సద్దుమణిగి వుంది.

అలా తూలుకుంటూ మెల్లగా కమల
కున్న గదిలోకి వెళ్ళింది. మెల్లగా ఆ పి
లేపింది. చెవులో గుసగుసలాడింది.

కమల తన ట్రంకు పెట్టె పట్టు
నిలబడింది. ఆమె చెయ్యి పట్టుకొని, బర
చీకట్లో నక్కుతూ నక్కుతూ ఆమెను మె
బయటికి నడిపించింది.

ఇంతలో ఒక బలమైన చెయ్యి వెనకను
ముక్క మెడమీద బలంగా పడింది. వులిక్కి
గబుక్కున వెనక్కి తిర్గి చూచింది.. ఆ కం
గూండా జార్జ్. చీకట్లో అతని మొగం
తంగా వుంది. అతడి కళ్ళు పులికళ్ళలాగా భ
కరంగా మెరుస్తోన్నాయి.

ముక్క కెవ్వున కేక పెట్టింది...

జార్జ్ ఆమెను రెండు చేతుల్తో పైకి లేవ
తీసికెళ్లి పాతసామాన్ల చీకటిగదిలోకి విసిరేశా

ముకుంద్ను, కాకినాడ జయలక్ష్మినీ
తీసికొచ్చాడు.

క్రొత్త రేజర్ బ్లేడులూ, కారండబ్బా,
క్రరలూ, నైలాన్ త్రాడులూ ఆ గది
వచ్చాయి.

చిత్రహింసల ఘట్టం ప్రారంభమైంది.

చుక్క అరుపులూ, ఆక్రందనలూ, పెను బొబ్బలూ, ఏడ్పులకు ఆ వేశ్యాగృహం దద్దరిల్లి పోయింది...

-3-

పదిరోజులుదాకా చుక్క మళ్లీ మామూలు మనిషి కాలేదు.

వాళ్ళు పెట్టిన ఆ చిత్రహింసలకు అసలికి అప్పుడే చచ్చిపోతుందనుకున్నారు. కాని, ఎలాగో బతికింది. లాఠీదెబ్బలకు వళ్ళంతా వాతలు తేలాయి. రేజర్‌బ్లేడుతో పిర్రల మీదా, తొడల మీదా చెక్కి కారంపెట్టినచోట పుళ్ళుపడ్డాయి. కారం దట్టించిన మర్మావయవం పచ్చి పుండయింది.

ఎలాగో లేచి కుంటుకుంటూ, నేవుకుంటూ కాస్త అటూ ఇటూ తిరుగుతూంది. చుక్క పరిస్థితి ఆ యింట్లో ఇప్పుడు గజ్జికుక్క కన్నా హీనమై పోయింది. జయలక్ష్మి, ముకుంద్ ఆమెని దగ్గరకు రానీయడంలేదు. మిగతా ఆడవాళ్ళని చుక్కతో మాట్లాడనీయకుండా ఆంక్షలు విధించారు. ఆకలితో చావకుండా ఇంత తిండి పడేస్తున్నారు.

చుక్క తనలో తాను కుమిలిపోతూంది. ఆ రాత్రి వాళ్లు పెట్టిన చిత్రహింసలకు తనని చావనీయకుండా బ్రతికించినందుకు దేముడ్ని తిడుతోంది.

ఒకరోజు మెల్లగా జయలక్ష్మి గదిలోకి వెళ్ళి ఆమె కాళ్ళమీద పడి, "తప్పయిపోయింది అక్కా!" అంటూ భోరున ఏడ్చింది.

జయలక్ష్మికి కొంచెం జాలేసింది. "ఆ మంగళగిరి గుంటకోసం ఎందుకే గుడిశేటిదానా అట్టా చేశావు? ఇప్పుడు ఆ గుంటనుచూడు! అందర్లాగే బిజినెస్ చేస్తోంది!" అంది.

ఈ గంజాయి వనంలో తులసిమొక్కలు బతకవులే అనుకుంది.


జయలక్ష్మి దగ్గర మళ్ళీ తన మామూలు స్థానం సంపాదించటానికి చుక్క నానా తంటాలు పడసాగింది. ఆ రాత్రి వాళ్లిద్దరూ గదిలో విస్కీ సేవిస్తూ వుంటె చుక్క గది బయట తారట్లాడుతోంది.

వాళ్ళ కబుర్ల మధ్యలో తన పేరు వచ్చింది. చెవులు రిక్కించుకొని వినసాగింది.

"ఈ చుక్క ముండని మళ్లీ ఎందుకు రానిస్తున్నావు?" అంటున్నాడు.

"ఛీ పొమ్మన్నా, అదే కుక్కలాగా వస్తోంది అల్లుడూ!"

"ఈ బద్మాష్ ముండకు తిండిపెట్టటం కూడ దండుగే! దీన్ని మస్తాన్‌గాడి పేవెంట్




కంపెనీకి అమ్మేద్దాం!"

"నీ యిష్టం అల్లుడూ! రేపే అమ్మేయి!" అంది.

"ఇప్పుడు మరీ చచ్చేదాని మల్లే వుంది. ధర పలకదు. నాల్లు రోజులు పొయ్యాక, కాస్త కండపట్టాక అమ్మితే మంచి ధరే పలుకుతుంది..."

వాళ్ళ ఆలోచన వినగానే చుక్క భయంతో గజగజలాడిపోయింది. నిలువెల్లా వణికిపోయింది.

తొందర తొందరగా నడుచుకుంటూ వచ్చి తన పాతసామాన్ల గదిలో కూలబడిపోయింది.

మస్తాన్‌గాడి పేవెంట్ కంపెనీ... మస్తాన్‌గాడి కంపెనీ... మస్తాన్‌గాడు... మస్తాన్ గాడు ... మస్తాన్... మస్తాన్...

చుక్క చెవుల్లో ప్రతిధ్వని- ధ్వని- ప్రతిధ్వని-- అదురుతున్న గుండెల్ని చేత్తో పట్టుకొని, గజగజా వణుకుతూ, ఆ చీకటి గదిలో క్రింద పడి పొర్లాడింది.

మస్తాన్‌గాడి 'పేవెంట్ కంపెనీ' అంటె, బొంబాయి నగర వేశ్య జీవితపరిసమాప్తానికి చరమ అంకమన్నమాట!

మస్తాన్‌లాటి నికృష్టపు ముండాకొడుకు బొంబాయిలో వాడు తప్ప ఇంకెవ్వరూ వుండడు. "ఏవే నీకు మస్తాన్‌గాడి పేవెంట్ కంపెనీకి పోవాలని వుందా?' అని బొంబాయిలోని ముండలకంపెనీ ఓనర్లు ఆడపిల్లల్ని భయపెడుతుంటారు. మస్తాన్‌గాడి మాట వినగానే వేశ్యాంగనలు భయంతో కుక్కిన పేనుల్లాగా పడి వుంటారు.

మస్తాన్‌గాడు వంటికన్నుతో, స్ఫోటకపు మచ్చల మొగంతో చూడ్డానికి భయంకరంగా వుంటాడు. డబ్బు సంపాదనకు వాడనుసరించే పద్ధతులు ఇంకా భయంకరంగా వుంటాయి. రాత్రి చీకటి పడగానే బొంబాయిలో బిజీరోడ్లు ప్రక్కనే మొబైల్ ప్రోతల్ కంపెనీలు ఓపెన్ చేస్తాడు. పేవెంట్స్ ప్రక్కన పాత టార్పాలిన్ కట్టి, ఒక చిన్న టెంట్‌లాంటిది ఓపెన్ చేస్తాడు. అందులో కొబ్బరిపీచు పాతపరుపు ఒకటి వేసి- ఒక పాత నైలాన్ చీరకట్టి, తలలో కాసిని పూలు పెట్టి, కాస్త స్త్రీ ఆకారంలో వుండే ఒక దౌర్భాగ్యురాల్ని ఆ టెంట్‌లో కూర్చోపెటుతాడు. రాత్రుళ్లు బొంబాయి పేవెంట్స్ మీద అక్కడా ఇక్కడా పడుకునే ముష్టోళ్ళు, కుష్ఠోళ్లూ, కుంటోళ్లూ, గుడ్డోళ్లూ, మూటలు మోసే కూలోళ్లూ దగ్గర రెండో మూడో తీసుగొని వాళ్ళను లోపలున్న ఆడదాని దగ్గరకు పంపిస్తాడు. ఆకలిబాధ తీర్చుకున్నట్లే వారానికీ పదిరోజులకు ఇలా కామబాధ తీర్చు కుంటారు వాళ్ళు.

మస్తాన్‌గాడి పేవెంటు కంపెనీలో అలా కొన్నాళ్ల వళ్ళు అప్పగించిన ఆడది మరికొన్నాళ్టికి ఏ రోడ్డు ప్రక్కనో శవంగా మారి వుం టుంది. కుళ్ళిపోయి దుర్గంధం కొడుతుంటే ఆ శవాన్ని బొంబాయి కార్పొరేషన్ వాళ్ళు ఈడ్చి పారేస్తారు... ఇదంతా కళ్ళ ముందు మెరిసి చుక్క భయంతో వణికిపోయింది.

తెలంగాణాలోని ఒక మారుమూల పల్లెలో ఒక తల్లి నవమాసాలూ మోసి, కని, లాలపోసి జోలపాడి ప్రేమగా పెంచగా పెరిగి, తన స్నేహితురాళ్లతో బతుకమ్మపాటలు పాడి, తొక్కుడుబిళ్ళల ఆటలు ఆడి కన్నె కలలు కన్న ఒక ఆడపిల్ల జీవితం బొంబాయి రోడ్ల ప్రక్కన ఇంత దారుణంగా, భయంకరంగా- పరిసమాప్తం కాబోతుంది... ఇలాటి ఆలోచనల్తో చుక్క, ఆ చీకటిగదిలో గుండెలు పగిలిపోయేటట్లు ఆక్రోశించింది; భయంతో వణికిపోయింది- అలా ఎప్పటికో నిద్రపోయింది.

ఒక రాత్రి చుక్కకు గబుక్కున మెలకువ వచ్చింది. ఆ చీకటి గదిలో తన్తోపాటు మరో మనిషి ఎవరో వున్నట్లనిపించింది. ఎవరో ఆగి ఆగి మెల్లగా ఏడుస్తూన్నారు.

మెల్లగా తన చెయ్యి ప్రక్కకు జాపింది. మెత్తటి వళ్ళు చేతికి తగిలింది. "ఎవరు?" అంది.

"నేను, కమల్ని!" అంటూ తనదగ్గరికిజరిగి మెల్లగా తన భుజం మీద చెయ్యివేసింది. ఆమె చేతిస్పర్శ చల్లగా, మృదువుగా వుంది. ఇంకా

మృదువుగా, జాలిగా దుఃఖంతో రాచుకుపోయిన గొంతుతో, "నా మూలంగా ఎన్ని చిత్ర హింసలు అనుభవించావు అక్కా!" అంది.

'అక్కా!' - తన గుండెల సేద తీర్చే తియ్యటి పిలుపు; తన గుండెలోతుల్ని తాకింది- చల్లగా, హాయిగా.

వణుకుతున్న చేతితో కమల జుట్టు నిమిరింది మెల్లగా.

"నన్నీ నరకకూపంలో పడకుండా నీవు రక్షించాలనుకున్నావు. కాని, నీవే నరకబాధలు అనుభవించావు నా కోసం.

వాళ్ళ రాక్షసత్వానికి నేను బలయ్యాను. ఇక్కడ్నుంచి తప్పించుకునే ఆశ లేదని? అటువంటి ఆశ వుంటే ఏం జరుగు తుందో నిన్ను చూస్తే తెలుస్తుంది" అంది కమల నిట్టూరుస్తూ.

చుక్క, కమల తల నిమురుతూ వుండిపోయింది.

ఇంతలో బయట్నుంచి దూరంగా దగ్గు వినిపించింది.

"ఎవరో నిద్రలేచినట్లున్నారు? తర్వాత మాట్లాడుకుందాం. ఇక్కడ్నుంచి ఎవరూ చూడకుండా తొందరగా వెళ్లిపో!" అని కమల్ని బయటికి పంపేసింది.

మళ్లీ తనకలవాటైన, తనకు తోడయిన ఆ చీకట్లోకే చూస్తూ కూర్చుంది...

**-4-**

ఆ మర్నాడు నుంచి చుక్క ఎవరో చేతబడి చేసినట్లు విచిత్రంగా మారిపోయింది. కమలతో విష్కారణంగా వైరం పెట్టుకుంది. అయినదానికి కానిదానికి అనవసరంగా గిల్లికజ్జాలు పెట్టుకొని పోట్లాడసాగింది. నోటికి వచ్చినట్లు తిట్టిపోస్తోంది. నా బాడీ కొట్టేసిందని ఒక రోజు, నన్ను చూచి నవ్వేసిందని మరోరోజు, ఇలా ప్రతి రోజూ దేనికో ఒకదానికి తిట్టటం మొదలు పెట్టింది.

ఆ రోజు రాత్రి అంత ప్రేమగా మాట్లాడిన మనిషి తెల్లారేసరికి ఇలా ఎందుకు మారిపోయిందో అర్థంకాక కమల అయోమయంలో పడింది. ఒక రోజయితే కమల్ని వంగపెట్టి వీపు మీద పిడిగుద్దులు గుద్దింది. కమల తిరగబడి మీదబడి రక్కింది. వీళ్లిద్దరి ఫార్సు ఆ యింట్లో వాళ్ళకు వినోదంగా వుంది.

ఒకరోజు సాయంత్రం కత్తులకు సాన పెట్టే సాయిబు ఆ వీధిలోకి వచ్చాడు. వంటింట్లో


## 1960కి ముందుగా మీరు జన్మించినట్లైతే ఈ ప్రకటన పూర్తిగా చదవండి.



ఆ 9 మందిలో మీరు ఒక్కరైతే ప్యూర్ సిల్వీక్రిన్ వాడటం నేడే ప్రారంభించండి.

మీ దువ్వెనతో మీ జుట్టును గట్టిగా దువ్వండి. మీ దువ్వెన మీదకి వెంట్రుకలు వచ్చినట్టయితే ఆనవాలు మీ జుట్టు ఊడిపోతుందన్న మాట. మీరు వెంటనే—అంటే యిప్పుడే చర్య తీసుకోవాలి. లేకపోతే మీ జుట్టు పల్చనై పోయినట్టు మీకు అద్దంలో స్పష్టంగా కన్పించటం ప్రారంభిస్తుంది. ముఖ్యమైన ఎమినో ఏసిడ్‌లు జుట్టుకి సహజమైన ఆహారం అవి కొరతైతే, జుట్టుపల్చబడిపోయి ఆరోగ్యం కోల్పోతుంది వాటి కొరతని తొలగించక పోయినట్టయితే జుట్టు ఊడిపోతూనే వుంటుంది. అందుచేత మీరు ప్యూర్ సిల్వీక్రిన్ వాడటాన్ని ఈ రోజే ప్రారంభించటం అవసరం




ప్యూర్ సిల్వీక్రిన్‌లో ఏమిటి ఉంటాయంటే :

① పెద్దది చేసిన ఒక ప్యూర్ సిల్వీక్రిన్ చుక్క సహజ జుట్టు అవసరాలని తీర్చేందుకు దేహం సమకూర్చే 17 ఎమినో ఏసిడ్‌ల అపూర్వ సమ్మేళనమే ప్యూర్ సిల్వీక్రిన్.

ప్యూర్ సిల్వీక్రిన్ ఎలా పని చేస్తుందంటే :

② లోపలకు చొచ్చుకు వెళ్ళే చర్య

ప్యూర్ సిల్వీక్రిన్ వెంట్రుకల మొదళ్ళలోవరకు వెళ్ళేదాక దాన్ని తలమీద చర్మ భాగంలో యింకేట్టు బాగా మర్దనం చెయ్యండి శాస్త్ర పరిశోధనలతో రూపొందించి ప్యూర్ సిల్వీక్రిన్‌లో ఇమిడ్చిన ప్రక్రియ పద్ధతి యిప్పుడు పని చెయ్యటం ప్రారంభిస్తుంది. మళ్ళీ జుట్టు పెరుగుదల కొనసాగేట్టు దోహదం చేస్తుంది. మీ జుట్టు మళ్లీ యథా ప్రకారం ఆరోగ్యంగా పెరిగే వరకూ మీరు ప్యూర్ సిల్వీక్రిన్‌ని రోజుకి రెండుసార్లు చొప్పున ప్రతి రోజూ వాడండి.



**ప్యూర్ సిల్వీక్రిన్**

OBM/9824/Tel

కత్తిపీటను తీసికెళ్ళి, ముక్కా దగ్గర నిలబడి బాగా పదునుగా సానపెట్టించింది. లోపలికి వస్తుంటే ఎవరో, 'కత్తిపీటకు సాన పెట్టించావు ఎందుకు ముక్కా?' అని అడిగారు. అప్పుడు అక్కడ కమల వుంది. కమల్ని చూపించి, "ఇదిగో ఈ లంజ మెడకాయి నరకటానికి!" అంది. "నీ మెడకాయే నరుకుతా!" అని కమల తిరిగి అంది. దానిమీద యిద్దరికీ మళ్ళీ పెద్ద పోట్లాట అయింది. ఆ గొడవకు జయలక్ష్మి అక్కడికి వచ్చి యిద్దర్నీ తిట్టి పోసింది.

ఆ మార్నాడు శుక్రవారం. జయలక్ష్మి ప్రతి శుక్రవారం తలంటుపోసుకొని బొంబా యిలో ప్రసిద్ధి గాంచిన మహాలక్ష్మి గుడికెళ్ళి ఆ రోజంతా నిష్టగా వుంటుంది. ఆ రోజు ముక్కా కూడ తలంటు పోసుకొని కాస్త మంచి బట్టలు వేసుకుంది. పెద్ద బొట్టు పెట్టుకుంది. తల నిండా పూలు పెట్టుకుంది. వోనరమ్మ వెంట తను కూడ గుడికెళ్ళింది.

ముక్కా గుడినుంచి తిరిగి యింట్లోకి వస్తోంటె కమల ఎదురయింది. తలంటుకున్న జుట్టు చిక్కు తీసుకుంటూంది. కమల్ని చూచి ముక్కా ఆప్యాయంగా చిర్నవ్వు నవ్వింది. ప్రేమగా పలకరించింది.

కమల వద్దంటున్నకొద్దీ వినకుండా గదిలో కూర్చోపెట్టి తల చిక్కు తీసింది.

"అబ్బ, నీదెంత పెద్ద జుట్టు పిల్లా!" అంటూ కమలకు తలదువ్వి జడేసింది. మహాలక్ష్మమ్మ అమ్మవారి పూజా పుష్పాన్ని జడలో తురిమింది. గుడినుంచి తెచ్చిన అమ్మవారి కుంకాన్ని బొట్టుపెట్టింది. ప్రసాదాన్ని పెట్టింది. ప్రేమగా దగ్గరకు తీసికొని బుగ్గమీద ముద్దు పెట్టింది.

ఆమె వాత్సల్యానికి కమల కరిగిపోయి కన్నీరు పెట్టుకుంది. ముక్కాలో వచ్చిన ఈ మార్పుకు ఎంతో సంతోషించింది.

ముక్కా వుషారుగా యింట్లో అటూ ఇటూ తిరిగింది. అందర్నీ పలకరించింది.

మరి కాసేపట్లోకి ఆ యింట్లోంచి కేకలూ, అరుపులూ, ఏడ్పులూ వినిపించాయి.

జయలక్ష్మి తన గదిలోంచి బయటికి పరిగెత్తుకుంటూ వచ్చింది. ఆడపిల్లలంతా పాత సామాన్ల గది దగ్గర గుంపుగా మూగి గుండెలు బాదుకుంటూ ఏడుస్తోన్నారు.

అందర్నీ తప్పించుకొని వోనరమ్మ ముందు కెళ్ళి చూచింది.

## తరంగాలు

జగతి శతకోటి గళముల సంతముగిసె
తరుల కురులు నిమురు వాయు కరము కునికె
పులుగు సడిలేని మన తోట పురుగు మెదిలె
ప్రేయసీ వేచి యుంటి నీ పిలుపు కొరకు!

—కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

ఆ గదిలో కనిపించిన దృశ్యాన్ని చూచి కొయ్యబారిపోయింది.

ముక్కా గదిలో క్రింద నెత్తురు మడుగులో పడి గిలగిలా కొట్టుకుంటూంది. మెడ సగానికి పైగా తెగిపోయింది. నిన్న సానపెట్టించిన కత్తిపీట ప్రక్కన పడి వుంది.

ఆ దారుణ దృశ్యాన్ని చూచి జయలక్ష్మి కళ్ళు తిరిగి క్రింద పడి పోబోయింది.

ముక్కా హత్యావార్త విని ఆ రెడ్‌లైట్ ఏరియాలోని జనమంతా వచ్చి మూగారు.

మరి కాసేపటికి పోలీసులు రంగంలోకి దిగారు.

ముక్కా కొనప్రాణంతో కొట్టుకులాడుతూంది.

"ఈ హత్య ఎవరు చేశారు?" అని ఇనస్పెక్టరు ముక్కాను అడిగాడు.

ఆమె మూతలు పడిపోతున్న కళ్ళను బలవంతంగా తెరచి ప్రక్కకు త్రిప్పి చూచింది.

ఆమె చూపులు ముందు వరుసలో వున్న కమలమీద నిలిచాయి. ఇనస్పెక్టరు కమల చెయ్యి పట్టుకొని, "ఈమేనా ఈ పన్జేసింది?" అని ముక్కాను అడిగాడు. అవునన్నట్లు మెల్లగా తల వూగించింది. కమల భయంతో వణికిపోయింది.

పోలీసులు కమల్ని కష్టడీలోకి తీసుకున్నారు. ముక్కా దగ్గర మరణవాఙ్మూలం తీసుకున్నారు. కమలే వెనకపాటుగా వచ్చి కత్తిపీటతో తన మెడకాయ తెగేసిందని ముక్కా చెప్పి, ప్రాణాలు వదిలింది. వీళ్ళిద్దరికీ వున్న శత్రుత్వం గురించి మిగతావాళ్ళంతా చెప్పారు. తుదిశ్వాస వదుల్తున్నప్పుడు ముక్కా చూపులు కమల మీదే నిలిచాయి. ఆమె కళ్ళు తనకేదో చెప్పబోతున్నట్టు కమల కనిపించింది...

పోలీసు వేన్ బొంబాయి నగర వీధుల్లోంచి పోతూంది.

పోలీసు వేన్‌లో కూర్చున్న కమల శూన్య దృక్కుల్తో రాతిబొమ్మలాగా కూర్చుంది.

ఇంతలో వేన్ ఎందుకో ఆగిపోయింది. కమల తల ప్రక్కకు త్రిప్పి బయటికి చూచింది. రోడ్డు రిపేరు మూలంగా ట్రాఫిక్ ఆగిపోయింది. వేన్లో పోలీసులు బీడీలు ముట్టించు కోటానికి క్రిందకు దిగారు.

ప్రక్కకు తిరిగినప్పుడు పమిటకొంగుకున్న ముడి కన్పించింది. ఆశ్చర్యంగా కొంగుముడి విప్పి చూచింది. బాగా మడతలు పెట్టిన వుత్తరం.

ఆదుర్దాగా విప్పి చూచింది. ముక్కా తనకు వ్రాసింది. ప్రొద్దుట జడేస్తున్నప్పుడు తన కొంగుకు కట్టినట్లుంది. తను చూచుకోలేదు.

ఆమె చూపులు గబగబా ఆ వుత్తరంలోని పంక్తుల మీదకు పరుగెత్తాయి. పోలీసులు వచ్చే లోపల పూర్తి చెయ్యాలని అక్కడక్కడ ఇలా చదవింది...

"...ఇక నాకు బ్రతకాలని లేదు. కావాలనే నేనీ అఘాయిత్యం చేసుకుంటున్నాను. కావాలనే ఈ నేరం నీ మీద మోపుతున్నాను... నిన్నీ నరకకూపంలోంచి శాశ్వితంగా తప్పించటానికే నేనిట్టా చేస్తోన్నా... నాకీ యింట్లోంచి ఇక విముక్తి లేదా అక్కా అని అడిగావు గుర్తుందా? నీకు విముక్తి కలిగించటానికే... నాక్కాడ విముక్తి... ఎట్లాగూ నిన్ను అరెస్టు చేస్తారు... కోర్టులో నీ కథంతా ధైర్యంగా చెప్పు... ఈ వుత్తరం కూడ చూపించు... నిన్ను అమ్మటం, బలవంతంగా నిన్నీ వృత్తిలోకి దింపటం అన్నీ చెప్పు. జడ్జీ మంచివాడయితే నీకు విముక్తి ప్రసాదిస్తాడు. నిన్ను మీ వూరికి పంపిస్తాడు... అందరిలాంటి వాడేఅయితే నీకు ఏ ఏడేళ్ళో పదేళ్ళో జైలు శిక్ష వేస్తాడు. ఈ పాడు బ్రతుక్కంటె ఆ జైలు బ్రతుకే నయం... ఏదన్నా పని నేర్పిస్తారు. ఇంత తిండి పెడతారు... నాకు లాగా ఈ భయంకర రోగాలుండవు... మనస్సు కుళ్ళీ, వళ్ళు కుళ్ళీ... అడ్డమైన కుళ్ళు వెధవలకు వళ్ళు అమ్ముకునే ఈ నికృష్టపు బతుకుండదు... జైల్లో మర్యాదగా, హాయిగా... ఎప్పుడన్నా దురదృష్టవంతురాలైన ఈ అక్కను తల్చుకొని రెండు కన్నీటి బొట్లు వదులు...... నాకంతే చాలు!...

తన రెండు చేతుల్లో మొగం దాచుకొని కమల భోరుభోర్న ఏడ్వసాగింది...

వేన్ మళ్ళీ కదిలింది.

*